



19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 7 ఫిబ్రవరి 2026 పేజీలు 8




# కచ్చితత్వంతో ఏకీకృత కుటుంబ సర్వే

### సేవల పంపిణీని మెరుగుపరిచేందుకు వీలు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** సంక్షేమ పథకాల లక్ష్యసాధన, సమర్థవంతమైన అమలు, పర్యవేక్షణ, సేవల పంపిణీని మరింత మెరుగుపరచడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను అభివృద్ధి చేస్తోందని.. ఇందులో భాగంగా అత్యంత కచ్చితత్వంతో ఏకీకృత కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతోందని మిగతా 2లో...

## స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో...

# ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి




- పేదరికంలేని సమాజ నిర్మాణానికి తమ వంతు సేవలందించాలి
- నూతన సాంకేతిక విధానంతో పారదర్శకంగా ప్రజలకు దగ్గరవ్వాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' సాధించడమే లక్ష్యమని 2

అంబాపురంలో

# ఎస్సీ స్మశానవాటిక కబ్జా

- పంచాయితీ కార్యదర్శి, వీఆర్వోపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- స్మశానవాటిక జోలికి వస్తే సహించబోమంటున్న ఎమ్మార్పీఎస్ నేతలు



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ పరిధిలో కబ్జారాయుళ్ళకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చేతులు కలపడంతో బాధితులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. వివరాల్లోకి వెళితే అంబాపురం గ్రామంలో సర్వే నంబర్ 6 లో ఎస్సీ స్మశాన వాటికలో 35 సెంట్లు డొంక భూమి ఉంది. స్మశాన వాటికకు అనుకుని ఉన్న నైనవరంలో పొలానికి దారి లేకపోవడంతో ఎస్సీ స్మశాణ వాటికనే కబ్జా చేయాలని చూశారు కొంతమంది కబ్జారాయుళ్ళు. తాజాగా ఎస్సీ స్మశాన వాటిక సమాధులను,కంచెను తొలగించి రాళ్లను పాతి మరీ దారి ఉన్నట్టుగా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనికి గ్రామపెద్దలు అండగా నిలుస్తున్నారని, నిన్న అంబాపురం పంచాయితీ సర్పంచ్ తో పెద్ద సమావేశమే ఏర్పాటు చేశారన్నది వినికిడి. అయితే సమావేశం లో ఏ చర్చించారనేది బయటకు రాకపోవడం కొసమెరుపు. ఇదిలా ఉంటే అంబాపురం గ్రామానికి ఉన్న ఏకైక శ్మసాన స్థలం ఇదొక్కటే. ఇప్పటికే ఈ చిన్న ప్రదేశం సరిపోవడం లేదని అధికారులకు ఊరు పెద్దలు మొర పెట్టుకుంటూనే ఉన్నారు. తాజాగా ఉన్న కొద్దిపాటి స్థలంలోనే మరళా కబ్జా కు గురవడంతో గ్రామంలోని గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు స్పందిస్తూ స్మశాన వాటికలో కబ్జా చేయడానికి గ్రామ పెద్ద ముసుగులో కబ్జా రాయుళ్లతో చేతులు కలపటం బాధాకరమైన ఘటనని పేర్కొన్నారు. ఎస్సీ స్మశాన వాటిక ను ఆక్రమించిన వారిని అడ్డుకుంటామని, కబ్జాదారులతో చేతులు కలిపిన గ్రామ మాజీ నాయకులకు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. దళిత పెద్దల ముసుగులో స్మశాన వాటిక జోలికి వస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదని, చట్టరీత్య చర్యలు తీసుకునేలాగా పోరాడుతామని హెచ్చరించారు. మిగతా 2లో

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం మేరకు 'విజన్ 2047'లో భాగంగా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్'ను సాధించడమే లక్ష్యమన్నారు. జిల్లా, మండల స్థాయి అర్బన్ లెవల్ స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులందరులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో వేర్వేరు క్యాడర్‌లలో ఉన్న అధికారులందరికీ నేడు ఇప్పుడు పదోన్నతులు లభించాయని ఆయన పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేదని, అయితే మెరుగైన పర్యవేక్షణ కోసం నేడు వాటిని సమన్వయం చేస్తూ స్వర్ణ గ్రామ సచివాలయాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న సుమారు 20,000 పోస్టులతో కలిపి మొత్తం 1,40,000 మంది సిబ్బంది స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ శాఖలో పనిచేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి (రేషనలైజేషన్) సేవలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను బలోపేతం చేస్తూ 10 మంది అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. మండల స్థాయిలో అధికారులకు సహాయంగా ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ ను నియమించామన్నారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మంది, ఇతర నగర పంచాయతీలలో జనాభాను బట్టి 4 నుండి 10 మంది వరకు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. క్లస్టర్ ఆధారిత సేవలను అందిస్తూ, సంబంధిత విభాగాలతో (లైన్ డిపార్ట్‌మెంట్స్) సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి గుర్తుచేశారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల, పట్టణ స్థాయిల్లో 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖలో పదోన్నతి పొందిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఆధునిక






సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని ప్రజలకు గౌరవ, వేగవంతమైన సేవలను అందించాలన్నారు.

స్వర్ణ గ్రామం/ స్వర్ణ వార్డు కేవలం పేరు మార్పు మాత్రమే కాదని 2047 నాటికి మన దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే ప్రక్రియలో భాగంగా ఈ మార్పు జరిగిందన్నారు. ప్రతి గ్రామం, వార్డులో మెరుగైన మౌలిక సదుపాయాలు (రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీ వ్యవస్థ) కల్పించి, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. సాంకేతికత వేగంగా మారుతోందని, ప్రభుత్వం ఇప్పటికే చాట్ బాట్లను ఉపయోగించి ఉత్తర్వులు జారీ చేసే స్థాయికి చేరిందని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలిగి, పనులను నిర్ణీత సమయంలో, నిబంధనల ప్రకారం గౌరవంగా పూర్తి చేయాలన్నారు. బయోమెట్రిక్ వంటి పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం లేని విధంగా, ప్రతి అధికారి తమ బాధ్యతను గుర్తించి సక్రమంగా పని చేయాలన్నారు. ఒక సామాన్య పౌరుడు ఆఫీసుకి వస్తే మనం ఎలా స్పందించాలో ఆలోచించి, సేవలందించాలని కార్యదర్శి కాటమనేని భాస్కర్ కోరారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ శాఖ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో 'గ్రామ వార్డు సచివాలయ శాఖ'గా ఉన్న పేరును నేడు 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖగా మార్చామన్నారు. సచివాలయాల పర్యవేక్షణ కోసం మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులతో కూడిన మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పనిభారాన్ని క్రమబద్ధీకరించడానికి జనాభా ఆధారంగా కార్యాలయాలను మూడు కేటగిరీలుగా విభజించామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ సెక్రటరీల పదోన్నతులపై ఉన్న సందిగ్ధతను తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒక 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' కమిటీని వేశామన్నారు. రాబోయే రెండు నెలల్లో దీనిపై స్పష్టమైన నిబంధనలు వస్తాయని డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ సీబీ అండ్ హెచ్‌ఆర్ జీవీ సూర్యనారాయణ, ఏడీసీ డీఎస్ ఎస్. గౌతమి, చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ సీహెచ్. చిన్నారావు, ప్రణాళిక శాఖ అధికారి అనంత శంకర్, తదితర అధికారులు ఓరియెంటేషన్ పై ఉద్యోగులకు, అధికారులకు అవగాహన కల్పించారు.



## అంబాపురంలో ఎస్సీ స్మశాన వాటిక కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

**పంచాయితీ కార్యదర్శి, వీఆర్ వో పై ఆరోపణలు ?**

అంబాపురంలో ఎస్సీ స్మశాన వాటిక కబ్జా వ్యవహారంలో అధికారుల అండదండలు కబ్జారాయుళ్ళకు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కబ్జారాయుళ్ళు ముందుగానే పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, విఆర్ వో మెండం సాయిలతో మాట్లాడుకొని ఉంటారన్న ప్రచారం జరుగుతుంది. అందుకే ఈ స్థలం వైపు కన్నెత్తి చూడడంలేదని, కొంతమంది పంచాయితీ కార్యదర్శికి, వీఆర్‌వోకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా కాని ఇప్పటిదాకా ఆ దరిదాపుల్లా కూడా వీళ్ళు వెళ్ళి విచారణ కూడా జరపలేదని చెబుతున్నారు గ్రామస్థులు. స్మశాన వాటికనే కబ్జా చేస్తున్న వారికి అధికారులు అండగా నిలవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చూడాలి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్మశాన వాటిక కబ్జా పై ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని... అంబాపురం, చుట్టుప్రక్కల గ్రామాల్లో అధికారుల అవినీతి అక్రమాలపై మరిన్ని కథనాలు తరువాయి సంచికలో...

## రోడ్లపై చెత్త వేస్తే జరిమానా




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం సర్కిల్-1 కార్యాలయం కలరా హాస్పిటల్, నందు సర్కిల్-1 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 17 కేసులపై విచారణ జరిపి వారికి 4,140 రూపాయలు జరిమానా విధించారు. రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్1 అన్నపూర్ణ, డి. సోమరాజు, ఎస్ వి ఎస్ శ్రీధర్ శానిటరీ సూపర్వైజర్స్, శానిటరీ ఇన్స్పెక్టర్లు జి. రంగారావు, కె .కృష్ణ , శామ్యూల్, దుర్గా రావు, వి. శ్రీనివాస్ రావు, డి. రాజు పాల్గొన్నారు.

# వినయ విధేయ విద్యార్థి నారా లోకేష్



**విజయవాడ, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** నేర్చుకోవడంలో నిత్య విద్యార్థి, పెద్దలను గౌరవించడాన్ని బాధ్యతగా ఆచరించే యువకుడు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. తన తండ్రితోపాటు సమానంగా రాజకీయాల్లో వచ్చిన వ్యక్తి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న తనయుడు, నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి సేవలు అందించిన సీనియర్ నేత, మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. లోకేష్ ప్రత్యేక ఆహ్వానం మేరకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీకి ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో ప్రస్తుత రాజకీయాలు, ఆ నాటి రాజకీయాలు, నైతిక విలువలు, పార్టీ బలోపేతం, నాడు పనిచేసిన శాఖల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గౌతు శివాజీతో కలిసి భోజనం చేశారు. శివాజీ అలనాటి ముచ్చట్లు చెబుతుంటే ఆసక్తిగా విన్నారు. పెద్దలను గౌరవించడం తల్లిదండ్రుల ద్వారా చిననాటి నుంచే అలవర్చుకున్న నారా లోకేష్, సీనియర్ల నుంచి సలహాలు తీసుకోవడంలోనూ, తెలియని విషయాలు నేర్చుకోవడంలోనూ నిత్య విద్యార్థిగా మారతారని గౌతు శివాజీ గారితో భేటీ వల్ల మరోసారి రుజువయ్యింది.

# రైజ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

**మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగండి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** గుంటుపల్లిలోని రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్)లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శుక్రవారం గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సందర్శించి, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి, అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, బోధనా విధానాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మహిళలు వ్యాపార అవకాశాలను విస్తృతం చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు అవసరమైన శిక్షణ, మార్గదర్శనం, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ మద్దతు వంటి సేవలను రైజ్ కేంద్రం ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. మహిళలు పారిశ్రామికంగా ఎదగడం అనేది కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధికి కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. స్వయం ఉపాధి అవకాశాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని, దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగవుతుందని తెలిపారు. కుటుంబ ఆదాయం పెరగడం వల్ల పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై మరింత శ్రద్ధ చూపగలుగుతారని, ఫలితంగా కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎ..ఎన్.వి. నాంచారరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## జీ తెలుగు ఆట కొత్త సీజన్ ఫిబ్రవరి 7న ప్రారంభం

**ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 9 గంటలకు..**

**టీవీ కంటే 48 గంటల ముందుగానే ప్రతి గురు, శుక్రవారాల్లో జీ5లో!**




**విజయవాడ, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలని అందిస్తూ వినోదం పంచుతున్న జీతెలుగు ప్రతిభా వంతులను వెలుగులోకి తీసుకురావడంలోనూ ముందుంటుంది. తెలుగు టెలివిజన్చరిత్రలో అత్యంత ఆదరణ పొందిన డాన్స్ రియాలిటీ షో జీ తెలుగు 'ఆట'. ఈకార్యక్రమంతో ఎందరో ప్రతిభా వంతులైన డాన్సర్లను వెలుగులోకి తీసుకొచ్చిన జీ తెలుగుఆట సరికొత్త సీజన్తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బుల్లితెర పాపులర్డాన్స్ షో 'ఆట' సరికొత్త సీజన్ ఫిబ్రవరి 7న ప్రారంభం, ప్రతి శని, ఆదివారాల్లోరాత్రి 9గంటలకు, మీజీ తెలుగులో.. ఫిబ్రవరి 5 నుంచి ప్రతి గురు, శుక్రవారాల్లోకొత్త ఎపిసోడ్స్ టీవీ కంటే 48 గంటల ముందే మన జీ5లో! ఎందరోప్రతిభావంతులను వెండితెరకు పరిచయం చేసిన ఆట సరికొత్త సీజన్కి ఎనర్జిటిక్ యాంకర్సుధీర్ వాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఆట టైటిల్ కోసం నలుగురు మెంటర్స్ కావ్య, విష్ణుప్రియ, వంశీ, సమీరాభరద్వాజ్ మార్గదర్శకత్వంలో 16మంది ప్రతిభావంతులు పోటీపడనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి రాధికా శరత్కుమార్, కొరియోగ్రాఫర్జానీ మాస్టర్, మెగాడాటర్ నిహారికా కొణిదెల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. ఆటసరికొత్త సీజన్ ప్రారంభ ఎపిసోడ్లో అద్భుతమైన ప్రదర్శనలతో కంటెస్టెంట్స్ పోటీపడనున్నారు. ఇటీవల బ్లాక్బస్టర్ హిట్ సాంగ్స్ 'సూసేకి అగ్గిపుల్ల', 'చుట్ట మల్లే', 'గిర గిర గిర'వంటి పాటలకు అద్భుతమైన కొరియోగ్రఫీతో కంటెస్టెంట్లు, మెంటర్లు డాన్స్ చేసి అలరించనున్నారు. అంతేకాదు, యాంకర్సుధీర్ ప్రస్థానంపై కంటెస్టెంట్ అక్షత ప్రదర్శన అందరినీ ఆకట్టుకోనుంది. కొరియోగ్రా ఫర్గా రాణిస్తున్న రాప్టర్ యువ రాజ్ కంటెస్టెంట్గా ఆట టైటిల్ పోరులో దిగనున్నారు. అద్భుతమైన ప్రదర్శనలు,భావోద్వేగ క్షణాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగనున్న ఈ కార్యక్రమం ప్రేక్షకులనుఅలరించేందుకు జీ తెలుగు వేదికగా ప్రసారం కానుంది.

## ఆంధ్రప్రదేశ్ అమరావతి క్వాంటం వ్యాలీని ప్రారంభించనుంది

**భారతదేశ క్వాంటం భవిష్యత్తుకు పునాది వేస్తోంది**

**అమరావతి, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 7న జరిగే అమరావతి క్వాంటం వ్యాలీ స్థాపన కార్యక్రమంతో అమరావతి భారతదేశ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రయాణంలో ఒక నిర్వచించదగిన మైలురాయిగా నిలిచేందుకు సిద్ధంగా ఉంది. తదుపరి తరం ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థగా భావించబడే అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటం పరిశోధన, అత్యాధునిక ఆవిష్కరణ, ప్రతిభ అభివృద్ధి, లోతైన పరిశ్రమ సహకారానికి ఆంధ్రప్రదేశ్ను ప్రపంచ కేంద్రంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిఎన్. చంద్రబాబు నాయుడు; సైన్స్ అండ్ టెక్నాలజీ & ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖకు గౌరవ కేంద్ర మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్;, ఆంధ్రప్రదేశ్లోని ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. అదనంగా, ఈ వేడుకలో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, భారతదేశంలోని ప్రముఖ టెక్నాలజీ, ఇంజనీరింగ్ కంపెనీల నుండి అగ్ర పరిశ్రమ ప్రతినిధులు సమావేశమవుతారు. ఈ వేడుకలో బలమైన పరిశ్రమ–విద్యారంగం–ప్రభుత్వ సహకారాన్ని ప్రతిబింబించే వరుస ప్రారంభాలు, అవగాహన ఒప్పందాలు జరుగుతాయి. వీటిలో ఏక్యూవి లోగో ఆవిష్కరణ, విజేతకు బహుమతి డబ్బు ప్రకటన, ఐబిఎం, టిసిఎస్ ద్వారా క్వాంటం క్లౌడ్ సేవలను ప్రారంభించడం ఉన్నాయి. ఐబిఎం టిసిఎస్ క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్, క్వాంటం టాలెంట్ హబ్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ద్వారా క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని స్థాపించడం ద్వారా ప్రధాన సంస్థాగత సహకారాలు అధికారికీకరించబడతాయి. అదనంగా, క్లయిర్వోయాన్స్ క్వాంటం ల్యాబ్స్ ద్వారా క్వాంటం–సేఫ్ అప్లికేషన్ ప్రారంభించబడుతుంది, తొమ్మిది ప్రముఖ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు, క్వాంటం పర్యావరణ వ్యవస్థలో బలమైన ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. ఈ కార్యక్రమంలో ఏక్యూవి హ్యాకథాన్ ప్రోగ్రామ్, మేధా టవర్స్ నుండి స్టార్టప్ల నుండి విద్యార్థులతో ప్రముఖుల సంభాషణ కూడా ఉంటుంది, ఇది యువత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతపై చొరవ యొక్క బలమైన దృష్టిని హైలైట్ చేస్తుంది. ప్రొఫెసర్ అభయ్ కరండికర్, భారత ప్రభుత్వం సైన్స్ & టెక్నాలజీ విభాగం కార్యదర్శి; ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, భారత ప్రభుత్వం ప్రధాన శాస్త్రీయ సలహాదారు; శ్రీ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఐటిఇ అండ్ సి కార్యదర్శి భాస్కర్ కాటంనేని; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్; ఐఐటి మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటి; ఎల్ అండ్ టి సిఎండి డైరెక్టర్ & సలహాదారు ఎం.వి. సతీష్; టిసిఎస్లోని సిటిఓ డాక్టర్ హారిక్ విన్; ఐబిఎం రీసెర్చ్ ఇండియా & సిటిఓ డైరెక్టర్ డాక్టర్ అమిత్ సింఘీ, ఐబిఎం ఇండియా/దక్షిణాసియా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. భారతదేశ జాతీయ శాస్త్ర సాంకేతిక ప్రాధాన్యతలకు అనుగుణంగా భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను అమరావతి క్వాంటం వ్యాలీ చొరవ నొక్కి చెబుతుంది. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ క్వాంటం పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి, టెక్నాలజీ–ఫార్వర్డ్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ స్థానాన్ని బలోపేతం చేయడానికి, తదుపరి తరం సాంకేతిక పరిజ్ఞానాలలో భారతదేశ నాయకత్వానికి అర్థవంతంగా దోహదపడటానికి ఇది ఒక నిర్ణయాత్మక అడుగు.

## విశ్రాంత ఉపాధ్యాయురాలు వసుమతి కన్నుమూత

**సిద్ధార్థ మెడికల్ కళాశాలకు శరీరదానం**





**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, శ్రీకమలా నెహ్రూ మహిళా మండలి నాయకురాలు పరుచూరి వసుమతి (86) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆమె గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన వసుమతి కమలానెహ్రూ మహిళా మండలి కోశాధికారిగా మహిళాభ్యుదయానికి కృషిచేశారు. వసుమతి భౌతికకాయాన్ని సీపీఐ నేతలు హనుమానుల సురేం ద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రాము, అట్లూరి వెంకటేశ్వరరావు, పాలడుగు రత్నబాబు, మల్లుపెద్ది రత్నకుమారి, హనుమానుల రాణీకుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నేతలు మాదాల వెంకటేశ్వరరావు, శీలం నారాయణరావు, యద్దనపూడి మధు, మహమ్మద్ కరీముల్లా, సుదర్శి సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, వాసవీక్లబ్ ప్రతినిధులు గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, ఉరిమి రమేష్ తదితరులు నివాళులు అర్పించారు. వసుమతి కోరికపై నేత్రదానం, శరీరదానం చేసేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. కుమార్తెలు మాకినేని వెంకట రమణ దుర్గాప్రసాద్, వెలివోలు ఇందిర –విద్యాసాగర్ లు వసుమతి భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు దానం చేశారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా ఈ కార్యక్రమం జరిగింది. చల్లపల్లి వాసవీక్లబ్ ద్వారా ఎల్వి.ప్రసాద్ ఆసుపత్రికి నేత్రదానం

## తిరుపతి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయకండి

**విశ్వహిందూ పరిషత్ కృష్ణ**



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం వారి పవిత్ర లడ్డు ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకుని అపవిత్ర పాలు చేయవద్దని కృష్ణాజిల్లా విశ్వహిందూ పరిషత్ మట మందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ కోరారు.శుక్రవారం స్థానిక రాజశేఖర్ స్వామి వారి దేవస్థానంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పవిత్ర లడ్డు ప్రసాదాన్ని అన్ని రాజకీయ పార్టీలు వేదికగా రాజకీయ అంశంగా మార్చేశారన్నారు.నిత్యం టీవీ ఛానల్ లో డిబేట్లు పత్రికలలో అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లడ్డు అంశంపై దర్యాప్తు జరిగిందని, ఇంకా లోతైన దర్యాప్తు జరిపించి బాధ్యులు ఎంతటి వారైనా తప్పనిసరిగా శిక్ష విధించాలన్నారు. భక్తుల మనోభావాలు, విశ్వాసాలకు భంగం వాటిల్లేలా రాజకీయ నేతలు ఆరోపణలు ప్రత్యారోపణలు చేస్తూ శ్రీవారి లడ్డూను అవమానిస్తున్నారని వాపోయారు. అన్ని పార్టీలు సమన్వయం పాటించాలని, భక్తుల విశ్వాసాలు మనోభావాలు దెబ్బతినేలా ఎవరు ప్రకటనలు చేయవద్దనేది విశ్వహిందూ పరిషత్ ముఖ్య లక్ష్యం అన్నారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యి లడ్డూలో కలవలేదు అనే విషయం ఎంత నిజమో రాష్ట్రవ్యాప్తంగా బహిరంగంగానే ఆవులను అక్రమ రవాణా చేస్తూ గోవధ జరుగుతుందని అనేది కూడా అంతే నిజమని వీటిని అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, హిందూ సమాజం కోరుకుంటుందన్నారు.



**మాగీ 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా**

## స్మారక తపాలా స్టాంప్ విడుదల

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో మ్యాగీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక ప్రత్యేక స్మారక తపాలా స్టాంపును విడుదలైంది. ఈ స్టాంపును నెస్లే ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ తివారీ, భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్తో కలిసి ఆవిష్కరించారు. ఈ స్టాంపు మ్యాగీ పరిణామానికి, ఎప్పటికప్పుడు కొత్త పోకడలను అందిపుచ్చుకుంటూ, ఎంతో ఆదరణ పొందిన ఒక ఉత్పత్తి వర్గానికి పర్యాయపదంగా మారిన దానికి నివాళి. ఇన్ని తరాలుగా, ప్రతి ఒక్క పంచుకునే క్షణం ద్వారా ప్రజలను ఏకం చేస్తూ వస్తున్న మ్యాగీకి ఇది ఒక గౌరవం. భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ, ఈ అద్భుతమైన ప్రయాణంలో 50 సం.లు పూర్తి చేసుకున్నందుకు మ్యాగీకి అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.

## రవాణా శాఖతో మారుతి సుజుకీ అవగాహన ఒప్పందం



**విజయవాడ మేజర్ న్యూస్ :** మారుతి సుజుకీ సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో నాలుగు ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్ ఏర్పాటు, నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణా శాఖతో మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఒక అంగీకార ఒప్పందంపై సంతకం చేసింది. ఏడీటీటీలు రాష్ట్రంలో ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి వంటి నాలుగు రీజనల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీస్ ప్రదేశాల్లో ఏర్పాటు చేయబడతాయి. ఎంవోఏ ద్వారా, మారుతి సుజుకీ ఈ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్ ను ప్రారంభించిన తేదీ నుండి మూడు సం.ల వరకు ఆటోమేట్ చేస్తూ నిర్వహిస్తుందని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో హిసాషి తకేవుచి తెలిపారు.

## కబడ్డీ క్రీడాకారుడు అరవపల్లికి నేతలు నివాళి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు అరవపల్లి సాంబ శివరావు ఇటీవల మృ తి చెందగా సంస్మరణ సభ నిర్వహించారు. జడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, టీడీపీ నేతలు కోనేరు బలరాం, కొత్తపల్లి, కొడాలి, కుందేరు గ్రామాలకు చెందిన పిఏసిఎస్ ల అధ్యక్షులు గొర్రెపాటి సురేష్, గుత్తికొండ ప్రసాద్, కుందేరు సొసైటీ అధ్యక్షులు చలసాని వెంకటే శ్వరరావు, తాతినేని సూర్య కిషోర్, వైఎస్సార్ సీపీ నేతలు తాతినేని కృష్ణారా వు, మూల్పూరి వెంకయ్య, దోనే వెంకటేశ్వరరావు, తదితరులు సాంబశి వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ అరవపల్లి వేణు, కుమార్తె తాతినేని వీణ కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నేడు పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాలలో ఈ నెల 7వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ట్రాన్స్ కో ఎఇ బి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని కపిలేశ్వరపురం, హనుమంతపురం, ముళ్ళపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. కావున ఆయా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అందుకు అనుగుణంగా తమ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆర్.ఎం.పి ప్రాథమిక చికిత్స కేంద్రం ఆకస్మిక తనిఖీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శుక్రవారం మచిలీపట్నం జవ్వారు పేటలో నాగబాబు ఆర్.ఎం.పి ప్రాథమిక చికిత్స కేంద్రమును జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ తమ సిబ్బందితో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఈ ప్రాథమిక చికిత్స కేంద్రంలో ఏడు ఇన్ పేషెంట్ బెడ్స్ 15 ఆక్సిజన్ సిలిండర్లు, హైడోస్ యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, ఐవీ ఫ్లూయిడ్ బాక్సులు కనుగొన్నారు. ఈ తనిఖీ సమయంలోనే ఒకరికి ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం కూడా కనుగొన్నారు ఈ ప్రాథమిక చికిత్స కేంద్రంలో చేయవలసిన పనులు అనగా వచ్చిన రోగికి ప్రథమ చికిత్స చేసి ఆరోగ్య సూచనలు ఇచ్చి గవర్నమెంట్ ఆసుపత్రికి రిఫర్ చేయడం వంటివి కాకుండా ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించడం మొదలగునవి చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. కనుక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమ తదుపరి చర్యల్లో భాగంగా షోకాజ్ నోటీసు జారీ చేసి ఈ ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని మూసివేయించారు.

## కురుమద్దాలిలో జాబ్ మేళా నిర్వహణ



**పామర్రు మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం మండల పరిధి లోని కురుమద్దాలిలో గల రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో "జాబ్ మేళా" నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళా కార్యక్రమంలో 11 ప్రముఖ కంపెనీలు ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 116 మంది హాజరు కాగా, వారిలో 60 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరుడు చైతన్య, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, చాట్ల రమేష్, కురుమద్దాలి పంచాయతీ కార్యదర్శి వేనం భార్గవి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్మెంట్ అధికారి తుర్లపాటి మధు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ టి.గుణరంజన్, సిబ్బంది వై. చంద్రశేఖర్, ఎ.వినయ్ కాంత్, టి.మనోజ్, కావ్య, కె.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## జి.కొండూరులో ఉచిత మెగా మెడికల్ క్యాంప్




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలం జి కొండూరులో వివేకానంద స్కూల్ దగ్గరలో ఉచిత బి ఎం డి మెడికల్ క్యాంప్ డాక్టర్ శివరాం గౌడ్ చే ఉచిత మెడికల్ క్యాంపును శుక్రవారం ప్రారంభించారు ఈ మెడికల్ క్యాంపులో 2000 విలువ గలిగిన టెస్టులను సుమారు 180 మందికి ఉచితంగా 360000 విలువగల టెస్టులు చేయబడినవి మండల పరిధిలో డాక్టర్ శివరాం గౌడ్ 180 మందికి 40000 విలువగల మందులను పంపిణీ చేసినట్టు ప్రకటనలో వెల్లడించారు జి.కొండూరులోని తన హాస్పటల్ విశ్వక్సేన్ ఆర్థో అండ్ జనరల్ హాస్పటల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 04 గంటల వరకు కీళ్లు మోకాళ్లు ఎముకల పరీక్షలను డాక్టర్ శివరాం గౌడ్ చే నిర్వహించబడినవి అని డాక్టర్ తెలిపారు ఈ క్యాంపును ప్రజలు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకున్నారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శివరాం గౌడ్ జి కొండూర్ మెయిన్ రోడ్ వివేకానంద స్కూల్ దగ్గర్లో విశ్వక్సేన్ ఆర్థో అండ్ జనరల్ హాస్పిటల్ విజయవాడ రోడ్ లో గల తన సొంత హాస్పిటల్ లో వచ్చిన పేషెంట్లకు భోజనం ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ శివరాం గౌడ్ వివరించారు.

# బాధితురాలి కుటుంబానికి అండగా మహిళా కమిషన్ చర్యలు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** బాధితురాలి కుటుంబానికి అండగా ఉండి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మెడికో దీపిక మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ శుక్రవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియా ప్రతినిధులతో చైర్ పర్సన్ మాట్లాడుతూ.. మెడికో దీపిక మృతి చెందడం చాలా దురదృష్టకరమని, ఈ విషయంలో వారి కుటుంబ సభ్యులకు మహిళా కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. బాధితురాలు గత మూడేళ్లుగా ఇక్కడే చదువుతోందని, ఆమె ప్రవర్తనలో ఏవైనా మార్పులు వచ్చాయా లేదా ఏదైనా ఒత్తిడి ఉందా అనే కోణంలో తోటి విద్యార్థులు, సహచర డాక్టర్లతో చైర్పర్సన్ వ్యక్తిగతంగా మాట్లాడారు. దీపిక చాలా ప్రతిభావంతురాలని, ఆమె ప్రవర్తనలో ఎలాంటి అసాధారణ మార్పులు లేవని విద్యార్థులు తెలిపారన్నారు. మృతదేహంపై ఉన్న 'పంక్చర్ మార్క్స్' (సూది గుర్తులు) దేనివల్ల వచ్చాయనేది తేలాల్సి ఉందని చైర్పర్సన్ పేర్కొన్నారు. నమూనాలను బయాప్సీ, ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం పంపామని, ఈ నివేదికలు రావడానికి రెండు నుండి మూడు వారాల సమయం పడుతుందని అధికారులు వివరించారన్నారు.

ఆహారం వల్ల విషప్రయోగం జరిగి ఉండవచ్చనే అనుమానాలను ఆమె తోసిపుచ్చారు. దీపికతో కలిసి భోజనం చేసిన మరో జూనియర్ డాక్టర్ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం వాంతుల నివారణకు వాడే 'ఆండన్సెట్రాన్' ఇంజెక్షన్ తీసుకున్నట్లు తెలుస్తోందని వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా కాల్ డేటా రికార్డ్స్ (సీడీఆర్), పోస్ట్మార్టం నివేదికల కోసం వేచి చూస్తున్నట్లు ఆమె తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టులు వచ్చిన తర్వాతే ఇది ఆత్మహత్యా లేక ఇతర కారణాలా అనేది స్పష్టమవుతుందన్నారు. బాధితురాలి కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. దర్యాప్తు పారదర్శకంగా జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. చైర్ పర్సన్ విజిట్ లో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆలపాటి ఏడుకొండలరావు, ఆర్ఎంవోలు ఉన్నారు.

## ఆరోగ్యవంతమైన ప్రజలే భారతావనికి ఆయువుపట్టు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన ప్రజలే భారతావనికి ఆయువుపట్టు అని, ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందించడానికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.జి.కొండూరు మండలంలోని చెవుటూరు గ్రామంలో రూ.36లక్షల 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించనున్న ఆరోగ్య మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రాథమిక చికిత్స, మాతా-శిశు సంరక్షణ, టీకాలు,, చిన్నపాటి జబ్బులకు మందులు ఉప కేంద్రాల ద్వారా లభిస్తాయని అన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి, భవన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముడిజింకును రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మాజీ ఏఎంసీ చైర్మన్ ఉయ్యూరు వెంకన్న నరసింహారావు మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు సీనియర్ నాయకులు నెల్లూరి లీల శ్రీనివాస్ ఉమ్మడి వెంకటస్వామి లక్ష్మీ కుమార్ గరిమెళ్ళ గోపాలరావు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సర్పంచ్ శ్రీదేవి కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఈనెల 12వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఏపి రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఏపి వ్యకాస జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, ఏపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కొసూరు శివనాగేంద్రం, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉ పాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లాలు విలేకర్లతో మాట్లాడారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలుచేసి సి టు ప్లస్ విధానంతో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనీ, విత్తన చట్టాన్ని రద్దుచేయాలనీ, కొత్త కౌలు చట్టాన్ని రద్దుచేసి పాతచట్టాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ నగదును జమచేయాలనీ, కొత్తఉపాధి చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని పునరుద్దరించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. డిమాండ్ల సాధనకోసం ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను, గోడపత్రికలను ఆవిష్కరించారు.

# కుంటముక్కల బాలికల హాస్టల్ సమగ్రాభివృద్ధికి కృషి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పేదల బిడ్డలు చదువుకునే కుంటముక్కల బాలికల హాస్టల్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల (బాలికలు)లో రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు. నీటికుంట పనులు పరిశీలించారు. మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఇక్కడ వసతుల మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకరంగా ఉంటూ చదువుపై దృష్టి నిలిపేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు.విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని వారి అభ్యున్నతికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని అన్నారు.విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని అన్నారు. దీనివల్ల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు.

విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ అందిస్తామన్న నమ్మకం తల్లితండ్రుల్లో కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షల్లోనూ ప్రతిభ చూపుతున్నారన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, వసతి గృహ పరిశుభ్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు కార్యదర్శి లంక నాగేశ్వరరావు పిఎసిఎస్ అధ్యక్షులు సుఖవాస శ్రీహరి కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్, కల్చర్ ప్రతిభా పోటీలలో పెడన మండల విద్యార్థుల ప్రతిభ




**పెడన మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలోని స్థానిక టీ.టీ.డీ కల్యాణ మండపం లో కృష్ణాజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెండు రోజులపాటు ఆర్ట్ కల్చరల్ ప్రోగ్రామ్స్ ను నిర్వహించామని ఈ పోటీలలో పెడన మండలానికి చెందిన విద్యార్థులు ఉత్తమమైన ప్రతిభ కనబరిచారని కృష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుముదిని సింగ్ సహిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డ్రాయింగ్, క్రాఫ్ట్, పోస్టర్ మేకింగ్, పేపర్ ఫోల్డింగ్, కోలేజి మేకింగ్ వంటి పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ పెడన మండలం నుండి ( కోలేజీ మేకింగ్ లో ), డి. తరంగిణి అహల్య – ఫస్ట్, ఎన్.శశికళ – సెకండ్,( పేపర్ ఫోల్డింగ్ లో) ఎన్.శశికళ – ఫస్ట్ డి.తరంగిణి అహల్య – సెకండ్ బట్ట మోహనరావు హైమవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోటముల, పి. మహేశ్వరి – ఫస్ట్ (పోస్టర్ మేకింగ్) బిఆర్ అంబేద్కర్ గురుకులం, బల్లిపర్రు కె. నాగ కావ్య – థర్డ్ (పోస్టర్ మేకింగ్) బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. వీరికి సమగ్ర శిక్ష కృష్ణ జిల్లా అధికారులు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రధానోత్సవం చేశారు. గెలుపొందిన విద్యార్థులను ఎం.ఈ.ఓ సలోమి ఎం.ఈ.ఓ 2 వై వి హరినాథ్ లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్య కో ఆర్డినేటర్ కళ్లేపల్లి ఏడుకొండలు, ఉపాధ్యాయులు ఏ. వీర రాఘవులు, సిహెచ్. బాలాజి కామేశ్వర రావు,, ఐ. దేవి, ఆర్ట్& క్రాఫ్ట్ టీచర్ ఎన్. విజయ శ్రీ, సహిత విద్య రిసోర్స్ పర్సన్లు అబ్దుల్ హమీద్, ఎన్.రమ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** 29 హెల్త్ సెంటర్ల నిర్మాణానికి 9.35 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. జి.కొండూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైలవరం నియోజక వర్గంలో పేదలకు వివిధ సంక్షేమ పథకాల నిమిత్తం రూ.429.60 కోట్లు చెల్లించినట్లు వివరించారు.అలాగే అభివృద్ధికి రూ.151.29 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ లేదా ఎల్.ఓ.సీ ల రూపేణా 12.94 కోట్ల రూపాయలు అందించామన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏపీ ప్రగతికి కృషి చేస్తోందన్నారు.సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా సాగుతుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో సైతం



ఆపన్నులకు అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరావు కేసరి వెంకటేశ్వర రెడ్డి పచ్చిగోళ్ళ బాలకృష్ణ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



# 12న దేశ వ్యాప్త జాతీయ సమ్మె జయప్రదం చేయండి

**వత్సవాయి ఫిబ్రవరి 6 మేజర్ న్యూస్:** వత్సవాయి మండల కేంద్రంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ నవంబర్లో లేబర్ కోడ్స్ దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. 29 కార్మిక చట్టాలు రద్దయ్యాని. కేరళ రాష్ట్రం ఒక్కటే లేబర్ కోడ్స్ అమలుకు నిరాకరించిందని. బీహార్ ఎన్నికల్లో నెగ్గిన వారానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చింది. విద్యుత్తు సవరణ బిల్లును. విత్తనాల సవరణ బిల్లును బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా 12న దేశవ్యాప్త సమ్మెకు జరుగుతుందని కార్మికవర్గమంతా సమ్మెలో పాల్గొని ఆ రోజు పట్టణ, మండల పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ప్రదర్శనలు జయప్రదం చేయాలని తెలియజేశారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చింది. కార్మిక వర్గాన్ని మరింతగా దోచుకోవడానికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయనేది. వారి భావన ఇప్పుడున్న హక్కులను కూడా తొలగించడమే లేబర్ కోడ్ల సారాంశమని కేంద్ర బిజెపి ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజల డబ్బులతో లేబర్ కోడ్లు గొప్పవని ప్రచారానికి (యాడ్స్) ఖర్చు పెడుతున్నది. లేబర్ కోడ్స్లో ఒకటైనా కార్మికులకు ఉపయోగపడే అంశం లేదు అని సవాల్ చేస్తున్నాం. ప్రభుత్వ ప్రకటనలు ‘అ‘ నుంచి ‘క్ష‘ వరకూ అన్ని అబద్ధాలే ఇప్పటివరకూ వేతనాలు పెంచుకునే వ్యవస్థ త్రైపాక్షిక్ష విధానం లేబర్ కోడ్లతో రద్దయ్యింది. ఒకే దేశం–ఒకే వేతనం పేరుతో జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178ల ప్రకారం వేతనాలు, పెరగకపోగా తగ్గిపోతాయి. దేశంలోనే అతి తక్కువ వేతనం ఉన్న రాష్ట్రాన్ని కొలబద్దగా తీసుకున్నారు. రోజు పని గంటలను 8 నుంచి 12కు మార్చారు. భవిష్యత్లో ఓవర్ టైమ్కు అదనపు జీతం ఇవ్వకుండా ఎగ్గొడతారు. ఇప్పటివరకూ ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలంటే కనీసం 7 గురు కార్మికులుంటే చాలు. లేబర్కోడ్స్ ప్రకారం కనీసం 100 మంది లేదా ఆ సంస్థ / రంగంలో పనిచేసే కార్మికుల్లో 10% మంది తగ్గకుండా ఉండాలని మార్చారు. పరిశ్రమలను లేఆఫ్, లాకౌట్ చేయాలన్నా, మూసివేయాలన్నా ఆ సంస్థలో 100 మంది కార్మికులు ఉంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ లేబర్ కోడ్ల ప్రకారం 300 మందిలోపు కార్మికులున్న ఏ పరిశ్రమనైనా అనుమతి లేకుండానే మూసివేయవచ్చు. అంటే 85% పరిశ్రమల్లో యజమానులు ఇష్టారాజ్యంగా మూసేయడానికి ప్రభుత్వం పరోక్ష అనుమతి ఇచ్చినట్లే ఇప్పటి వరకూ ఈఎస్ఐ పథకం వర్తించాలంటే ఒక యజమాని క్రింద 10 మంది కార్మికులు పనిచేస్తే సరిపోతుంది. దానిని 20 మందికి పెంచుతూ లేబర్ కోడ్స్ మార్చారని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్ యూనియన్ నాయకులు నాయకులు వెంకటేశ్వర్లు ఆర్.రాజు, స్వామి, గురవయ్య, స్వామి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### యుటిఎఫ్ ఆధ్వర్యంలో

# కరపత్రాల ఆవిష్కరణ



**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం – ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో చేపట్టిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ కి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు ఆవిష్కరించారు. ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా శాఖల సూచనల మేరకు పామర్రులోని విద్యాశాఖ కార్యాలయం వద్ద మండల విద్యాశాఖ అధికారులు ఎ.భాను ప్రకాష్, జి.పద్మావాణిల చేతుల మీదుగా యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే 12వ పిఆర్సి ఏర్పాటు, ఆర్థిక బకాయిల సాధన, వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రికి పంపే పోస్ట్ కార్డుల ఉద్యమం, తదితర విషయాలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా యుటిఎఫ్ కార్యదర్శి లంకా నరేంద్ర హాజరై ప్రసంగించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కోటేశ్వరరావు, మాజీ జిల్లా కార్యదర్శి ఎం.రవీంద్ర ప్రసాద్, మండల అధ్యక్షులు షేక్ ముస్తాఫా, మండల ప్రధాన కార్యదర్శి శౌంరి అంకరవి, మండల బాధ్యులు కిశోర్, స్వర్ణవాహిని, పి.వెంకటేశ్వరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రజక వృత్తిదారుల మహా ధర్నాను జయప్రదం చేయండి



**పామర్రు మేజర్ న్యూస్ :** ఈ నెల 20వ తేదీన తాడేపల్లి లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మడక రాజు పిలుపునిచ్చారు. పామర్రు లోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళిక హామీల అమలు చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా అధ్యక్షులు పాండురంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అవనిగడ్డ రజినీకాంత్, జిల్లా కార్యదర్శి కాటూరు నాగభూషణం, జిల్లా కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, పి మహేష్, పోలుకొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలంలోని కోడూరు గ్రామంలో రూ.36 లక్షల 15 ఆర్థిక సంఘం నిధులతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గోకులం షెడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పల్లెల్లో వైద్య ఆరోగ్య సేవలను గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా విస్తృతంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో పశువుల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరగా, దీనికి తగు కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కోడూరు గ్రామంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కి ఘనస్వాగతం లభించింది. మామిడితోటల్లో కాయలను కోసేందుకు ట్రాక్టరుకు లిఫ్టును అమర్చిన గెరా విజయకుమార్ ను అభినందించారు. ముక్కామల తరుణిప్రియ పుష్పాలంకరణ వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు మండల కార్యదర్శి లంక నాగేశ్వరావు గుడిపూడి శివశంకర్ మాజీ ఎంపీటీసీ కోటి బాబు బొర్రా అశోక్ కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత మహా గర్జనను విజయవంతం చేయండి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మంగళగిరి ఫిబ్రవరి 22న నేతన్న సర్కిల్ వద్ద జరగబోయే చేనేత మహా గర్జనకు రాష్ట్ర చేనేత నాయకులు అందె జగదీష్ను రాష్ట్ర చేనేత నాయకులు ఆకురాతి జనార్ధనరావు శుక్రవారం ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమల దుర్భర పరిస్థితిలో ఉన్నాయని ఎన్నికలలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలు తుంగలో తొక్కడం సరికాదన్నారు. ఎన్నికలలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. 14 సం“ గా సహకార సంఘాలకు నిర్వహించని ఎన్నికలు వెంటనే నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నుండి చేనేత సంఘాలకు రావలసిన బకాయిలు చెల్లించి, చేనేత పై ఆపాదించిన జీఎస్టీని తొలగించాలన్నారు. కమ్యూనిస్టు నాయకులు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు రూ. 25,000/– నేతన్న నేస్తం, ఉచిత విద్యుత్తును త్వరిత గతిన అమలు చెయ్యాలని, సహకార సంఘాలతో పాటు ఆప్కోకు కూడా ఎన్నికలు నిర్వహించి, ఆప్కో పని తీరును క్రమబద్ధీకరణ చెయ్యాలని, మంగళగిరి లో జరిగే మహాగర్జన కు చేనేత కార్మికులంతా పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. పి. ఫణికుమార్, గోరురాజు, కోదాటి నాగయ్య ఘంటశాల గ్రామ చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## టైమ్స్ ఆఫ్ ఇండియా ఐకాన్స్ హెల్త్ కేర్ అవార్డ్ గ్రహీత డాక్టర్ బళ్ళా నాగార్జునకు ఘన సన్మానం






**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం వైద్యం అందు బాటులోకి వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బళ్ళా నాగార్జునకు 2026 సంవత్సరానికి గాను టైమ్స్ ఆఫ్ ఇండియా ఐకాన్స్ హెల్త్ కేర్ అవార్డును ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి ఎస్.ఎన్.పాలెం గ్రామంలో సర్పంచ్ అడపా అంజిబాబు ఆధ్వర్యంలో డాక్టర్ నాగార్జున బళ్ళాకు ఘన సన్మానం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన డాక్టర్ నాగార్జున జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. ఆయన సేవలు యువ వైద్యులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అనంతరం అవార్డు గ్రహీత డాక్టర్ నాగార్జునను శాలువా, పుష్పగుచ్ఛా లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ఎస్.ఎస్.కుమార్, పొట్లూరి ప్రసాద్, బళ్ళా వీర వెంకట్రావు, పొట్లూరి రాము, అడపా యుగందరరావు, అడపా దేవుల బాబు, దుట్టా శివన్నారాయణ, దుట్టా రాంబాబు, చిన్నాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి జండా ఆవిష్కరణ



**అవనిగడ్డ,మేజర్ న్యూస్ :** స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయ ప్రాంగణంలో ఐఎన్‌టియుస ట్రేడ్ యూనియన్ నూతన జండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. శుక్రవారం ఆల్ ఇండియా ఐఎన్టియుసి అధ్యక్షులు వి.నరసింహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలుమాట్లాడుతూ, కార్మికులకు అండగా నిలుస్తున్న ఐఎన్‌టియుసి చరిత్రను గురించి వివరిస్తూ వారి అమూల్య సందేశాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేయగా టెంపరరీ సబ్ స్టాప్ కు సెక్యూరిటీ సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం నరసింహన్‌ను శాలువా పూల బొకేలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ శోభన్ కుమార్ జనరల్ సెక్రెటరీ యు వి రమణ డివిజన్ ప్రెసిడెంట్ ఎల్ వి ఎల్ ఎన్ శాస్త్రి ఎల్ఐసి అవనిగడ్డ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు పి శ్రీనివాసరావు, వైవి రమణమూర్తి కోశాధికారి ఎస్సార్ రాజేశ్వరి తో పాటు పలు అనుబంధ కార్మిక సంఘాల వారు పాల్గొన్నారు.

## అవనిగడ్డ పుర వీధుల్లో శ్రీ కంచి కామకోటి పీఠం శిష్యబృందం ఉంచ వృత్తి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** శ్రీ కంచి కామకోటి పీఠానికి చెందిన శిష్యబృందం అవనిగడ్డ పుర వీధుల్లో ఉంచ వృత్తి నిర్వహించడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శుక్రవారం రాత్రి స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయ వేషధారణలో, భక్తి భావంతో శిష్యులు పాదయాత్రగా వీధుల వెంట సంచరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. శిష్యబృంద సభ్యులు వేద మంత్రోచ్చారణల మధ్య చేతుల్లో పూజా సామగ్రి, గురుపరంపర చిత్రపటంతో ముందుకు సాగారు. భక్తులు తమ ఇళ్ల ముందు నిలబడి వినయపూర్వకంగా నమస్కరించి, ధాన్యం, ఫలాలు, దక్షిణ వంటి కానుకలను సమర్పించారు. శిష్యులు భక్తులు అందించిన ఫలసాయం, కానుకలను స్వీకరించి ఆశీర్వచనాలు అందించారు. ఈ ఉంచ వృత్తి కార్యక్రమం ద్వారా గురుపరంపర సేవా పరంపరను కొనసాగించడమే లక్ష్యమని పీఠానికి చెందిన భక్తులు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా పలు ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలు అందించారు.

# స్వర్ణాంధ్రకు అక్షరాంధ్ర సౌరభాలు





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని నిరక్ష్యరాస్యులు అక్షరాస్యులుగా మారి.. బంగారు భవితకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ అర్బన్ పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కేంద్రాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. అక్షర జ్ఞానాన్ని పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారి అభ్యసన సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలతో ముచ్చటించి, బోధనా పద్ధతులను పరిశీలించారు. వాలంటీర్లు అందిస్తున్న శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లాలో వయోజనులైన దాదాపు 96 వేల మంది నిరక్షరాస్యులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించడం జరిగిందని, వీరందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అక్షర జ్ఞానం ద్వారా వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా పొందే లాభాలను కలెక్టర్ వివరించారు. చదువు అనేది కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా, ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ ద్వారా ఎన్ని సౌకర్యాలు పొందుతున్నామో మరోవైపు అంతే ప్రమాదం పొంచి ఉందని.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుకే డిజిటల్ లిటరసీ కూడా పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కేదారేశ్వరపేటలో...**



శుక్రవారం సాయంత్రం విజయవాడ అర్బన్ పరిధిలోని కేదారేశ్వరపేటలో ఏర్పాటు చేసిన ఉల్లాస్‌అక్షరాంధ్ర కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలవుతున్న కార్యక్రమాల తీరు, బోధనా విధానాలు, నమోదు ప్రక్రియలను పరిశీలించారు. అక్షరాస్యత పెంపుదల లక్ష్యంగా చేపట్టిన ఉల్లాస్‌అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు నాణ్యమైన బోధన అందేలా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు.

## రేషన్ షాపు సీజ్



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైనమొవ్వ లోని 2వ నెంబరు రేషన్ షాపును శుక్రవారం రెవెన్యూ శాఖ అధికారులు సీజ్ చేశారు. 2వ నంబర్ చౌక ధరల దుకాణం డీలర్ నెరసు. శ్రీనివాసరావు రేషన్ షాపును సక్రమంగా నిర్వహించట్లేదని, రేషన్ షాపులోని నిత్యవసర వస్తువులను కార్డుదారులకు పంపిణీ చేయకుండా అక్రమ మార్గంలో అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నాడని, షాప్‌ను సక్రమంగా ఎందుకు తీయడం లేదని కార్డుదారులు ప్రశ్నిస్తే నీకు చెప్పాల్సిన పనిలేదని, మా అమ్మాయి స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తుందని, నాకు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందని, నాకు అధికారుల అండ దండలు మెండుగా ఉన్నాయని అస హనం వ్యక్తం చేస్తున్నాడని, అలాగే ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న నిత్య వసర వస్తువులు బ్లాక్ మార్కెట్ కి తరలించి సొమ్ము చేసుకుంటున్నాడనిఅతని పై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఈనెల 2వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అర్జీ నెంబర్ కెఆర్ఐ20260202514౦లో జిల్లా కలెక్టర్ కు మొవ్వ గ్రామానికి చెందిన మండవ. శ్రీకృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పిడిఎస్ డి. టీ.కే. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయదుర్గలు శుక్రవారం సాయంత్రం2వ నెంబర్ చౌక ధర దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చౌక ధరల దుకాణం మూసి ఉండటం అధికారులు గమనించి డీలర్ శ్రీనివాసరావుకు అధికారులు ఫోను చేయగా స్పందించలేదని దీంతో షాపును సీజ్ చేశామని పిడిఎస్ డి.టీ తెలిపారు. స్థానిక తహసిల్దార్ కే. మస్తాన్ పర్యవేక్షణలో షాపును సీజ్ చేసినట్లు డిటి శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు.

## స్వర్గీయ సచివాలయ ఉద్యోగి కుటుంబానికి సహఉద్యోగులు అండగా నిలబడటం ఐక్యతకు చిహ్నాం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వర్గీయ సచివాలయ ఉద్యోగి కుటుంబానికి సహఉద్యోగులు అండగా నిలబడటం ఐక్యతకు చిహ్నామని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తమ చాంబర్లో స్వర్గీయ కళ్లేపల్లి విశ్వనాథ్ కుటుంబానకి, సచివాలయం కార్యదర్శిలు సమకూర్చిన రూ.300000ల ఫిక్స్‌డ్ డిపాజిట్ డాక్యుమెంట్లు అందజేసారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్గీయ కళ్లేపల్లి విశ్వనాథ్ కుటుంబానికి అండగా నిలబడినందుకు వార్డు సచివాలయం ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులను అభినందించారు. ఈ కార్యం ఎంతో గొప్పదని, సహఉద్యోగి కుటుంబానికి సచివాలయం కార్యదర్శులందరూ అండగా నిలబడటం ఐక్యతకు చిహ్నామని, ఆ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలను సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయడానికి కృషిచేస్తామని తెలియజేశారు. కళ్లేపల్లి విశ్వనాథ్ ఇద్దరు కూతుర్లకు ఒక్కొక్కరి పేరున రూ.1,50,000/- చొప్పున మూడులక్షల రూపాయలను వారిద్దరి భవిష్యత్ అవసరాలకోసం జాతీయ బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను, భార్య హస్మత్ కు అందజేశారని అన్నారు. ఈ సందర్భంగా సెక్రెటరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్-1 లోని 155వ వార్డు సచివాలయం లో వార్డు సంక్షేమ, విద్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కళ్లేపల్లి విశ్వనాథ్ ఆకస్మికంగా గుండెపోటుకు గురై డిసెంబర్ 27 న మరణించడం బాధాకరమైన విషయమని, విజయవాడ వార్డు కార్యదర్శులు ఏర్పాటుచేసిన సంతాప సభలో వార్డు సచివాలయ ఉద్యోగులందరు సమిష్టిగా మృతుని కుటుంబానికి అండగా నిలవాలని చేసుకున్న తీర్మాణం మేరకు విజయవాడలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు అందరూ విజయవాడ నగర పాలక సంస్థ సెక్రెటరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతీ వార్డు సచివాలయ ఉద్యోగి జీతంలోనుంచి కొంత నగదును సమీకరించి, ఆ సమీకరించిన మొత్తానికి అదనపు కమీషనర్ ( ప్రాజెక్ట్స్ ) డా. డి. చంద్రశేఖర్ కూడా కొంత నగదును మొత్తం రూ.4,16,000/- జమచేసి అందులో మొదట రూ.1,16,000/- చెక్కు అందజేయగా రెండో విడతలో రూ.300000 ఫిక్స డిపాజిట్ డాక్యుమెంట్ను అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ ధ్యాన చంద్ర హెచ్. ఎమ్. ఐ.ఏ.ఎస్., అదనపు కమీషనర్ ( ప్రాజెక్ట్స్ ) డా. డి. చంద్రశేఖర్ తో పాటు విజయవాడ నగర పాలక సంస్థ సెక్రెటరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు, ఇతర వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# పైడి సుధాకర్ నిర్వహణలో ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** "వేంకటేశ్వరస్వామి దివి నుండి భువికి దిగి వచ్చాడన్నట్లుగా" కమనీయ దృశ్యాలు కనువిందు చేశాయి. ఈ అపూర్వ దృశ్యాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్‌లోని లక్ష్మీ నారాయణ క్రాకర్స్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పైడి సుధాకర్ సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వైభవోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన



కార్యక్రమం కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, సాయంత్రం కార్యక్రమాలు, రాత్రి ఏకాంత సేవ వరకు భక్తి పారవశ్యంతో సాగింది. హనుమాన్ జంక్షన్ చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ వేడుకలను తిరుపతి నుంచి విచ్చేసిన వేద పండితులు, నాదస్వర విద్వాంసులు తిరుమలలో జరిగే విధానంలోనే శాస్త్రోక్తంగా నిర్వహించడం విశేషం. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరినీ ఆత్మీయంగా ఆహ్వానించి అన్నదానం (విందు భోజనం) ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వైభవోత్సవం భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది.

# ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో చేయాలి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో చేయాలని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, దుర్గా ఘాట్, పున్నమి ఘాట్, భవాని ఘాట్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివరాత్రి పండుగ సందర్భంగా వచ్చే భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాలు అన్ని కల్పించాలని, ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లలో శాశ్వత చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని, ఘాట్ల పారిశుధ్యం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిత్యం పారిశుధ్య నిర్వహణ జరుగుతూ ఉండాలని, ఘాట్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవానిపురం డివైడర్లలో హరితాన్ని పెంచాలని, పున్నమి ఘాట్ లో గ్రీనరీ పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేటట్లు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ ఖాళీ స్థలాలలో ప్రజలకు ఆహ్లాదపరిచే విధంగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్ లో ప్రాజెక్టులు తెచ్చే విధంగా అధికారులను చర్యలు తీసుకోమని కమిషనర్ ఆదేశించారు. తదుపరి ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లో అన్న క్యాంటీన్ ను పరిశీలించి పారిశుధ్య నిర్వహణలో, త్రాగునీరు, వాడుక నీరు సరఫరా లో ఎటువంటి లోపం ఉండరాదని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలని విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ వి కామేశ్వరరావు ప్రజలతో అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం కోనేరు వారి వీధి ప్రాంతం లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వివిఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, బయోలజిస్ట్ కామేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## కచ్చితత్వంతో ఏకీకృత కుటుంబ సర్వే

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వే (యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామవార్డు సచివాలయ కుటుంబ డేటాబేస్‌లో నమోదైన కుటుంబాలను కవర్ చేస్తూ సర్వే నిర్వహించడం జరుగుతోందన్నారు. అర్హులైన కుటుంబాలకు సంక్షేమ ప్రయోజనాలు అందించడం, రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌ను సంతృప్తికర స్థాయిలో నాణ్యంగా రూపొందించడం, వివిధ శాఖల ద్వారా ఆధార సహిత విధానాల రూపకల్పనకు దోహదం చేయడం లక్ష్యంగా సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రాథమిక సమాచారంతో పాటు సామాజిక, విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర సమాచారంతో డేటా బ్యాంకు రూపకల్పన జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జోనల్ కమిషనర్ ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.

# ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్





**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** శుక్రవారం ఉదయం 10:00 "గంటల నుండి" విజయవాడ సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన 12వ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని, ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ రాష్ట్రంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుముఖ్యమంత్రి వరకు కూడాప్రజల నుంచి వచ్చే ప్రశ్నలు, అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రత్యేకంగా శాసనసభ్యుల కార్యాలయాల్లో ప్రతి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఓపికతో స్వీకరించి, వాటిని రికార్డు చేసి, ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తున్నామని చెప్పారు. అందిన ప్రతి అర్జీకి తగిన పరిష్కారం తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు పదివేలకు పైగా అర్జీలు, అప్లికేషన్లు అందాయని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో సెంటు పట్టాల పేరుతో ప్రజలను మోసం చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయని, వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని పేర్కొన్నారు. అయినప్పటికీ రికార్డుల్లో ఇల్లు ఉన్నట్టు చూపించడంతో, ప్రస్తుతం ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో పరిమితుల మధ్య పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినప్పటికీ వీలైనన్ని సమస్యలకు పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే కొత్తగా వృద్ధాప్య పెన్షన్లు, విధవ పెన్షన్లు, ఒంటరి మహిళల పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని కచ్చితంగా పరిశీలిస్తున్నామని, ఇందుకోసం 15 మంది అధికారులు కార్యాలయంలోనే ఉండి ప్రతి అంశాన్ని రికార్డు చేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ప్రతి అర్జీపై ఇంటింటికి వెళ్లి మళ్లీ విచారణ చేసి, ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. "మాకు అధికారం ఒక అలంకారం కాదు అది ఒక బాధ్యత, ఆ బాధ్యతను నెరవేర్చడమే మా లక్ష్యం, మా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు అని అన్నారు. ఈ ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీ విషయంలోసీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీలు, ఇళ్ల సమస్యలు తదితర అన్ని అంశాల్లోబాధ్యతతో వ్యవహరించి తగిన పరిష్కారం చూపించే విధంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ సివిఏపి (నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్) స్పెషల్ ఆఫీసర్ ఎం.నాగ మల్లేశ్వర రావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్,జోనల్ కమీషనర్ ప్రభు దాసు,సీడీఓ జగదీశ్వరి, స్వర్ణాంధ్ర ఏ2047 టీమ్,హౌసింగ్ ఏఇ ఇర్ఫాన్, విజయకృష్ణ సూపర్ బజార్ చైర్మన్ వెలగా సురేష్, యంగ్ ప్రొఫెషనల్ ఆర్.వెంకటేష్, సివిఏపి యూనిట్ సభ్యులు, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవిద్య లగ్జరీ షోరూమ్ ప్రారంభం

## సందడి చేసిన సినీనటి పాయల్ రాజ్‌పుత్







**విజయవాడ, ఫిబ్రవరి 6, మేజర్ న్యూస్ :** విజయవాడలో వారసత్వ ఫ్యాషన్ కోసం ఒక కొత్త గమ్యస్థానం ఆవిష్కృతమైంది. శ్రీ విద్య తన అత్యంత ప్రీమియం షోరూమ్‌ను నగరంలోని పివిపి మాల్ రోడ్ లో బాలాజీ స్వీట్స్ ఎదురుగా ప్రారంభించింది. హస్తకళ, సున్నితమైన డిజైన్ విస్తృత శ్రేణి జాతి దుస్తులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. 2015లో గుంటూరులో స్థాపించబడిన శ్రీవిద్య, నాణ్యమైన భారతీయ వస్త్రాలు, ప్రత్యేక సందర్భాల దుస్తుల కోసం ఒక విశ్వసనీయమైన పేరుగా స్థిరంగా ఎదిగింది. సంప్రదాయంలో పాతుకుపోయి, హస్తకళ పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతున్న ఈ బ్రాండ్, విజయవాడలో తన విస్తరణతో తన ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటి పాయల్ రాజ్‌పుత్ ప్రారంభించారు. గౌరవ అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరయ్యారు. శ్రీవిద్య వ్యవస్థాపకులు ఓం ప్రకాష్ దేవాసి మాట్లాడుతూ శ్రీవిద్య 2015లో గుంటూరులో ప్రారంభమైందన్నారు. హస్తకళ, సంప్రదాయాన్ని ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. విజయవాడ మాకు ఒక సహజమైన ముందడుగులా అనిపించిందన్నారు. ఎందుకంటే, ఇది పట్టు, సంస్కృతి, కుటుంబ సంప్రదాయాలకు విలువనిచ్చే నగరం అన్నారు.

ఈ షోరూమ్ మా ప్రస్థానాన్ని, వారసత్వాన్ని చాటిచెబుతూనే, మహిళకు కూడా సముచితంగా ఉండేలా కలెక్షన్‌లను అందించాలనే మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ షోరూమ్, ప్రీమియం, వివేకం గల వినియోగదారుల కోసం మూడు అంతస్తుల లగ్జరీ రిటైల్ అనుభవంగా రూపొందించబడింది. ఈ ప్రాంగణం బ్రాండ్ నిశ్శబ్ద సౌందర్య తత్వాన్ని ప్రతిబింబిస్తూ, వినియోగదారులు ఆలోచనాత్మకంగా రూపొందించిన కలెక్షన్‌లను అన్వేషించడానికి ప్రశాంతమైన లీనమయ్యే వాతావరణాన్ని అందిస్తుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా 'రాజేసి వస్త్రం' అనే కొత్త కలెక్షన్‌ను కూడా ఆవిష్కరించారు. ఇది బ్రాండ్ హస్తకళ, వారసత్వం ఆలోచనాత్మక లగ్జరీ అనే స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఈ షోరూమ్‌లో రోజువారీ సొగసు, పండుగ సందర్భాలు వివాహాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విస్తృత శ్రేణి చీరలు, డిజైనర్ చీరలు గౌన్లు, ఘాగ్రాలు, సల్వార్ సూట్లు, కుర్తీలు, డ్రెస్ మెటీరియల్స్‌తో సహా జాతి దుస్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సినీ నటి పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ 'నాకు చీరల సొగసు శాశ్వతత్వం అంటే ఎప్పుడూ చాలా ఇష్టం. శ్రీవిద్య కలెక్షన్ నిజంగా మంత్రముగ్ధులను చేసేలా ఉంది. ముఖ్యంగా సాంప్రదాయ నేతలను ఆధునిక సొగసుతో మిళితం చేసిన విధానం అద్భుతం. ఈ ప్రారంభోత్సవం కోసం విజయవాడకు రావడం, ఇంతటి అద్భుతమైన దుస్తులను ఒకే చోట చూడటం నాకు చాలా ఆనందంగా ఉందని' తెలిపారు. శ్రీవిద్య చీరల కలెక్షన్‌లో కంజీవరం పట్టు, జందానీ, బనారసి, టస్సర్ సిల్క్, రాజ్‌కోట్ పటోలా–ప్రేరేపిత వస్త్రాలు, జరీ కోట, ఖాదీ పట్టు వంటి భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ నేతలలో కొన్నింటిని ప్రదర్శించారు. ప్రతి వస్త్రం సాంప్రదాయ కళాత్మకత, సమకాలీన దృక్పథం యొక్క సమతుల్యతను ప్రతిబింబించింది, క్షణికావేశపు పోకడల కంటే శాశ్వతమైన డిజైన్‌లపై బ్రాండ్ యొక్క దృష్టికి కట్టుబడి ఉంది. ధరలు రూ. 2,000 నుండి రూ. 3,00,000 వరకు ఉండటంతో శ్రీవిద్య సాధారణ రోజువారీ దుస్తులు కోరుకునే వారి నుండి ప్రత్యేక సందర్భాల కోసం ప్రీమియం, ప్రత్యేకమైన వస్త్రాల కోసం చూస్తున్న పోషకుల వరకు విస్తృత శ్రేణి వినియోగదారుల అవసరాలను తీర్చింది.

# ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు పాఠాలు బోధించిన కలెక్టర్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లోని 50వ డివిజన్ డ్రైవర్స్ కాలనీలో స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులతో ముచ్చటించి కూడికలు,తీసివేతలు ఎంత మేరకు చేయగలుగుతున్నారో స్వయంగా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డీ ఈ ఓ యు వి సుబ్బారావు, మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# అమీనపురంలో ఘనంగా డా. బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహ శంకుస్థాపన





**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం, ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని రమేష్ కొనియాడారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని అమీనపురం గ్రామ అంబేద్కర్ నగర్ లో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంతగాని రమేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, బౌద్ధ ధర్మం ప్రకారం బుద్ధవందనం చేసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన జ్ఞాన సభలో పంతగాని రమేష్ మాట్లాడుతూ అమీనపురం గ్రామంలో త్వరలో పెద్ద స్థాయిలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలకు దిక్కుతూచిగా మారిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల బానిసత్వం, మూఢాచారాల నుంచి విముక్తి చేసి, రాజ్యాంగం ద్వారా విద్య, ఉపాధి, రాజకీయ అధికారాలు కల్పించారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన విగ్రహాల ప్రతిష్ఠలు నేటికీ జరుగుతూనే ఉన్నాయని, ఆయన త్యాగాలు ఇప్పటికీ అందరి మన్ననలు పొందుతున్నాయని అన్నారు. చిన్న గ్రామంగా ఉన్న అమీనపురం గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానం తీసుకుని, ఆ మహనీయుడి ఆదర్శాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు.

"జై భీమ్, జై భీమ్" అని నినదించారు. కార్యక్రమంలో అంబేద్కర్ రైట్, వ్యాపారవేత్త ఎమ్మెస్ ఆర్ సుబ్రహ్మణ్యం ఆలపించిన అంబేద్కర్ గేయాలు అలరించాయి. ఉద్యమకారుడు, న్యాయవాది పులి శ్రీనివాసరావు, బీఎస్పీ నాయకులు దాసరి భాను కుమార్, అంబేద్కర్ సిద్ధాంత ప్రచారకులు కోడే రామనాథ్, సీనియర్ అంబేద్కర్ రైట్ కూర్మ విజయ్ గోపాల్, తెనాలి బుచ్చిబాబు, హైకోర్టు అడ్వకేట్ గూడపాటి చింతయ్య పాల్గొని ప్రసంగించారు. విగ్రహ కమిటీ పెద్దలు, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.



## విజయకనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పోతేపల్లి జ్యువెలరీ పార్కు ఆటో నగర్లో వేంచేసియున్న శ్రీ విజయ కనకదుర్గ సమేత మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో ప్రతి నెల మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకాలు కుంకుమార్చనలు, వివిధ రకాల పూలమాలలు, నిమ్మకాయల దండలు, వడమాల దండలతో అలంకరించి సువాసినిలతో అమ్మవారి లలితా పారాయణం చేయించారు. తదుపరి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని,ఈరోజు గొప్ప అన్న సంతర్పణ కార్యక్రమము జరిగినది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగిత ఏడుకొండలు భార్య నాగమణి దంపతులు, పర్యవేక్షణలో, సత్య సాయి సేవ సమితి నుండి సాయిరాం ఆంజనేయులు న్యాయకత్వంలో 20 మంది సేవాదారులు వచ్చి అమ్మవారి సేవా కార్యక్రమం లో పాల్గొన్నారు. చింతల దుర్గ భవాని, మట్ట నాగేశ్వరరావు, పడమట నవీన్ కుమార్, పామర్తి నాగేశ్వరరావు, మట్ట నాగరాజు మొదలగు భక్తులు సహకారములతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఘనంగా అంకమ్మ తల్లి ఆలయ నవ వార్షికోత్సవం



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని కాపుల బజార్‌లో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి ఆలయ నవ వార్షికోత్సవము శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పూలతో విద్యుత్ తోరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు చింతలపాటి పవన్ కుమార్ శర్మ,, ఐదుగురు వేద పండితుల మంత్రోచ్చారణలతో చిన్నారులతో. వాగ్దేవి హోమం, మేధా దక్షిణామూర్తి హోమం, నిర్వహించారు. తదుపరి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్న సమారాధన నిర్వహించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## దోమల నివారణకు చర్యలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డగ్రామపంచాయతీలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రతి శుక్రవారం గ్రామంలో జరిగే ఫ్రైడే కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలు సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పరిశీలించారు. గ్రామంలోని అన్ని గృహాలను పరిశీలించి నీరు నిల్వ ఉన్నచో లార్వాల నిర్మూలనకు మందు పిచికారి చేసి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షకుడు కమ్మిలితారక రామారావు, ఎన్ సునీత,ఆశా కార్యకర్తలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999